

A Very Well-Acclaimed Aauthor Of
Two English Novels
"The Enemy of the Mankind" and
"The Dictator of the Dark"

# సూర్యదేవర రామ్ మోహన రావు

AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS IN TELUGU



# త్రివేణి

తెలుగులో అత్యంత ఎక్కువ సోషల్ నవలలు రాసి రికార్డ్ సృష్టించి
125 వ నవలకు చేరువవుతున్న మీ అభిమాన రచయిత
**The Number One Best Selling Author**


## సూర్యదేవర రామ్‌మోహనరావు


# త్రివేణి


మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

**TRIVEI**
(Direct Novel)

By

**SURYADEVARA RAM MOHANA RAO**
Sri Venkata Anantha Sai Nilayam
Flat No.63, Road No.71
Navanirman Colony, Jubilee Hills
Hyderabad - 500 096
E-mail : suryadevaranovelist@gmail.com
www.suryadevararammohanrao.com
www.suryadevaranovelist.com.

Published by:
**MADHU PRIYA PUBLICATIONS**
Machavaram, Vijayawada - 520 004
Phone : 0866 - 2431969

Edition :
**2015**

Price :
**Rs. 180-00**

Cover Design :
**DURGA RAO**

Printers :
**SRI CHAITANYA OFFSET PRINTERS**
Vijayawada-2

# త్రివేణి

**రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం.**

**అది హిమాయత్ నగర్‌లోని ఒక అందమైన కాలనీ, ఆ కాలనీలో ఓ ప్రశాంతమైన వీధి. ఆ వీధిలో కుడిపక్క వుంది అందమైన ఆనంద నిలయం.**

చుట్టూ చక్కని కాంపౌండ్. ఆవరణలో నాలుగు ఫలవృక్షాలు, పూలతోటల మధ్య రెండంతస్థుల అధునాతన భవంతి. సింపుల్ అండ్ సూపర్‌గా చూడగానే ఆకర్షించే ముచ్చటయిన కట్టడం.

అదే ఆనంద నిలయం!

ఆ ఇంటి ఓనరు పేరు వెంకటాచలపతి. ఆయన సతీమణి పేరు ఆనంది. ఆవిడ పేరుమీదుగానే ఆ కట్టడానికి ఆనంద నిలయం అని పేరు పెట్టాడు వెంకటాచలపతి.

ఆ దంపతులకు ముగ్గురు సంతానం.

పెద్ద కూతురు త్రివేణి.

ఆ తర్వాత నితీష్, సతీష్ అని యిద్దరూ మగపిల్లలే.

ఆయన తన ఫ్యామిలీతో ప్రస్తుతం అమెరికాలో వుంటున్నాడు. కొడుకులిద్దరూ అక్కడే వుండి చదువుకుంటున్నారు.

మరయితే ప్రస్తుతం ఆనంద నిలయంలో ఎవరు వుంటున్నారని డౌటు రావటం సహజం కదూ!

వెంకటాచలపతిగారికి తండ్రి లేడుగాని తల్లి ఇంకా బ్రతికేవుంది. ఆవిడ పేరు బాలాత్రిపురసుందరి. అంతా బాలమ్మా అని పిలుస్తుంటారు.

ప్రస్తుతం ఆవిడ వయసు డెబ్భై సంవత్సరాలు. మనిషి కాస్త పొడుగ్గా, కాస్త లావుగా, ఎర్రగా, జాంపండు రంగులో వుండి, ఇప్పటికీ చలాకీగా తిరిగేస్తుంటుంది. ఆవిడకు పూజలూ, వ్రతాలూ అంటే చాలా యిష్టం.

కొడుకు, కోడలు అంతా ఫారెన్‌లో వున్నా, ఈవిడ మాత్రం ఇక్కడే వుం డిపోయింది. ఇప్పుడు ఆవిడతోబాటు ఆవిడ మనవరాలు త్రివేణి కూడా యిక్కడు వుంటోంది.

కొంతకాలం తల్లిదండ్రులతో బాటు అమెరికాలో వున్న త్రివేణికి దేశభక్తి ఎక్కువ. అందుకే లా చదువుకోడానికి ఇండియా వచ్చేసి బామ్మ దగ్గర వుంటోంది.

ఇరవై మూడేళ్ళ వయసులో కుందనాల బొమ్మలా వుంటుంది త్రివేణి. వయసు తెచ్చిన సొగసులేకాదు... ఆమె మనసు కూడా సొగసైనది... సొంపయినది.

ఒక తెలుగింటి ఆడపిల్లకు వుండాల్సిన లక్షణాలన్నీ ఆమెలో వున్నాయి.

ముక్కుమీద వుంటుంది కోపం. తప్పు చేసినవాళ్ళు ఎవరయినాసరే కాలర్ పట్టి నిలదీసే మనస్తత్వం. నిజానికి ఆమె స్వభావానికి ఏ పోలీస్ డిపార్ట్‌మెంటో అయితే బాగుండేది. కాని అడ్వంచర్ల కన్నా, అట్టడుగు పేద వాడికి కూడ న్యాయం జరగాలనే ఆశయంతో ఆమె ఇలా చేస్తోంది.

నిజానికి మనవరాలు ఏదో చదివి దేశాన్ని ఉద్ధరించాలనుకోవటం బామ్మగారికి యిష్టంలేదు. చక్కని కుర్రాడ్ని చూసి పెళ్ళిచేసేసి మురిసిపోవాలని ఆవిడ ఆశ.

ఆమె ముచ్చటకీ ఓ కారణం వుంది.

ఆ మధ్య ఎప్పుడో చింతపల్లి అడవుల్లోంచి ఓ కోయదొర వచ్చి బామ్మగారి చేయి చూసి జాతకం చెప్పాడు.

“పోయిన నీ మొగుడంటే నీకు పంచప్రాణాలే తల్లే. అయనకు నీ మీద మనసు తీరలేదే మాయమ్మా! అందుకేనమ్మ నీ మనవరాలి కడుపున బిడ్డగ పుట్టి నీ చేతుల్లో ఆడుకోబోతున్నాడే తల్లే.....” అంటూ వాడు చెప్పిన నాలుగు మాటలు ఆవిడ గుండెల్లో నాటుకుపోయాయి.

మనవరాలు త్రివేణికి తొందరగా పెళ్లిచేసేస్తే తన భర్తని మునిమనవడి రూపంలో చూసి మురిసిపోవాలని ఆవిడ ఆరాటం. అందుకే ఈ మధ్య మనవరాలి మీద పెళ్ళికి వత్తిడి తెస్తోంది. ఈ విషయంలో యిద్దరికీ తరచూ గొడవలు సహజమైపోయాయి.

అయితే–

విచిత్రమైన విషయం ఏమంటే–

ఎంత కీచులాడుకున్నా కూడా బామ్మ – మనవరాళ్ళు యిద్దరికీ ఒక రంటే ఒకరికి ప్రాణం.

పోతే ఆ ఇంట్లో వీళ్ళిద్దరేకాదు–

ఎంతో కాలంగా ఆ ఇంటిని నమ్ముకుని బ్రతుకుతున్న మునియ్య దంపతులు, వాళ్ళ పిల్లలుకూడ అక్కడే అవుట్‌హౌస్‌లో వుంటారు. ఇంటి పని, తోటపని అంతా వాళ్ళే చూసుకుంటారు. వంట విషయంలో మాత్రం ఎవరి కిచెన్‌లో అడుగుపెట్టనీదు బామ్మ. ఒకరి వంట ఆమెకు నచ్చదు. తనే వంట చేస్తుంది. పాకశాస్త్రంలో బామ్మది నలభీమపాకమే. బామ్మ వంటంటే త్రివేణికి చాలా యిష్టం.

ఇదండి మరి ఆనంద నిలయం పరిస్థితి.

శీతాకాలంలో ఒక ఫైన్ మార్నింగ్.

ఆనంద నిలయంలో ఏం జరుగుతోందో చూద్దాం.

*         *         *         *         *         *

“దిక్కుమాలిన చలి. మరీ ఈ సవంత్సరం దయ్యంలా పట్టి పీడిస్తోంది. ఈ మహానగరంలో ఇంత చలి నా జీవితంలో చూళ్ళేదు. అంతా కలికాలం....” అని సణుక్కుంటూ విసవిసా పూజగదిలో ప్రవేశించింది బామ్మ.

పూజా మందిరంలో–

అన్ని దేవుళ్ళ ఫోటోలూ వున్నాయి.

దీపారాధన చేసి పూజా కార్యక్రమం ఆరంభించిందావిడ. పెద్ద గొంతులో శ్లోకాలు చదవటం ఆమె అలవాటు. ముందుగా వినాయకుడి శ్లోకంతో పూజ ఆరంభించింది.

శుక్లాం బర ధరం విష్ణుం

శశి వర్ణం చతుర్భుజం

ప్రసన్న వదనం ధ్యాయేత్

శోక్లం పూర్తి కాకముందే–

ఎక్కడో ఏదో భళ్ళున పగిలిన శబ్దం.

అంతటితో పూజకు అంతరాయం ఏర్పడి శ్లోకం ఆపేస్తూ కంగారుగా తిరిగి చూసిందావిడ.

“అపచారం... అపచారం... ప్రసన్న వదనం అంటే అప్రసన్న వదనంతో చూస్తావేమిటయ్యా వినాయకా! ఈ పిల్లరాక్షసి ఏం పగలగొట్టే సిందో ఏమిటో!” అనుకుంటూ పూజ మధ్యలోనే ఆపేసి లేచి గబగబా హాల్లోకి పరుగెత్తింది.

ఆవిడ వెళ్ళేసరికి–

కుడిచేతి గోళ్ళు కొరుకుతూ తీరిగ్గా సోఫాలో కూర్చునుంది త్రివేణి. ఆమె ఛాతీ ఆవేశంతో ఎగసిపడుతోంది. చూపుల్లో భగ్గున మండేంతగా కోపం వుంది. మోసాయిక్ ఫ్లోర్ మీద చిందరవందరగా గాజుపెంకులు.

వాటిని చూసి గుండెలు బాదుకుంది బామ్మ.

“అయ్యో అయ్యో, నిక్షేపంలాంటి వెయ్యిరూపాయల గ్లాస్ పేర్‌సెట్‌ని పగలగొట్టేస్తావా! నీకేమైందే?” అనరించింది.

"నాకు బాగానే వుంది. నువ్వే మరీ ఫీలయిపోతున్నావ్. అని నీ కొడుకు సంపాదనకాదు. నా సంపాదనతో నేను కొన్న గాజుసామగ్రి. నా కోపానికి పాపం బలయిపోయాయి" అంది తీరిగ్గా త్రివేణి.

"అయితే మాత్రం పగలగొట్టేస్తావా?"

"ఇదేమిటి... నాకు తిక్కరేగిందంటే ఇంట్లో సామానంతా పగలగొట్టి మునిసిపాలిటీ చెత్తకుప్పలా చేసేస్తాను. ముందు నాకీ విషయం తెలియాలి. ఎంత ధైర్యం వుంటే వీడు నా గదిలోకొస్తాడు. ఎవడే వీడు?" అంటూ ఒక ఫోటోని ఆవిడ మీదకు విసిరింది. కిందపడకుండా గాల్లోనే ఆ ఫోటోని అందిపుచ్చుకుంది బామ్మ.

"ఇదేం చోద్యమే! మన అడ్రసే ఈ కుర్రాడికి తెలీదు పైగా ఫారెన్నుంచి మూడురోజుల క్రితమే వచ్చాడు. ఈ కుర్రాడు నీ గదిలోకి రావటం ఏమిటే?"

"వాడు వస్తే ఒకటి. వాడి ఫోటో వస్తే ఒకటీనా? మర్యాదగా చెప్పకపోతే నీ పీక నొక్కి చంపేస్తాను. ఈ గొట్టంగాడి ఫోటో నా గదిలో నా టేబిల్ మీదకు ఎలా వచ్చింది?"

"ఎలా ఏమిటి? నాకు నచ్చాడు. నీకూ నచ్చుతాడేమోనని నేనే అక్కడ వుంచాను."

"నచ్చితే... మనిద్దరం వీడ్ని చేసుకుందామా?"

"ఓసినీ... నా వయసుతో వేళాకోళం ఏమిటే?"

"నా వయసుతో వేళాకోళం అడొచ్చా? వయసట వయసు. ఇలాంటప్పుడు మాత్రం వయసు గుర్తుంటుంది. బూతు సి.డి.లు తెచ్చుకుని నేను లేనప్పుడు చూస్తే అప్పుడు వయసు గుర్తుండదు. ఆ షాపువాడు ఏమన్నాడో తెలుసా? బామ్మగారు ఇప్పుడే యిలా వున్నారంటే వయసులో విరగ దీసుంటారండి బాబూ. మళయాళం సి.డి.లు, ఇంగ్లీషు సి.డిలు ఎప్పుడూ కావాలంటారు అన్నాడు. పౌరాణిక సినిమాలు చూసే వయసులో నీకు శృంగార సినిమాలు అవసరమా?"

"అవసరమా అంటే... కాదా ఏమిటి? వయసు శరీరానికే గాని మనసుకి కాదే పిచ్చిమొద్దు. ఎప్పుడూ ఉల్లాసంగా, సరదాగా, ఆరోగ్యంగా వుండాలంటే శృంగానికి మించిన టానిక్ లేదనేవాడు మీ తాతయ్య."

"చెత్తకబుర్లు చెప్పకు. మరోసారి సి.డి.ల షాపువైపు వెళితే చంపేస్తాను."

"రామరామ... ఇక వెళ్లనుగాని ఈ ఫోటోలో కుర్రాడ్ని చూడవే. అమెరికాలో డాక్టరు. మంచి సంబంధం కోసం చూస్తున్నాడు. నువ్వు సరేనంటే పెళ్ళిచూపులకు ఏర్పాటుచేస్తాను."

"నా చదువు అయ్యేవరకు..... కాదుకాదు. చదువుపూర్తయి వృత్తిలో మంచి పేరు తెచ్చుకునేవరకు నేను పెళ్లి చేసుకోను. మళ్ళీ మళ్ళీ చెప్పను గుర్తుంచుకో."

"అలాగంటే ఎలాగే.... మీ తాతయ్య నీ కడుపున పుడతాడని కోయదొర చెప్పాడే. నాకు నా మొగుడ్ని చూడాలని చాలా తొందరగా వుంది. ఆ ముచ్చట తీరాలంటే నువ్వు పెళ్ళిచేసుకోవాలి గదా?"

"బామ్మా... పొద్దుటే నా మూడ్ పాడుచేయకు... చేయకపోడం ఏమిటి ఖర్మ. ఆల్రెడీ చేసేసావ్. ఇంకోసారి పెళ్ళిగిళ్ళి అన్నావంటే బామ్మవని కూడా చూడను. ఇక మాట్లాడకు. నేను ఆఫీసుకు వెళుతున్నా" అంటూ తన హేండ్‌బేగ్, బ్రీఫ్‌కేస్ తీసుకుంది.

బామ్మ పెదవి కదవలేదుగాని మనవరాల్ని కొరకొరా చూస్తోంది త్రివేణి కూడా కోపంగా చూసింది.

"మళ్ళీ ఇంకో మగాడి ఫోటో నా రూపంలోకి వచ్చిందో... నన్ను రాచిరంపాన పెడుతున్నానని నీమీద కోర్టులో కేసువేసి నేనే వాదిస్తాను... జాగ్రత్త" అంటూ విసవిసా బయటకు నడిచింది.

"వెళ్లవే వెళ్ళు" అనరిచింది వెనకనుంచి బామ్మ.

"నీలాంటి రణపెంకిని పొగరణచే కుర్రాడు ఎక్కడో పుట్టే వుంటాడు. నీ తిక్క కుదురుస్తాడు" అంది తిరిగి తనే.

డోర్ దగ్గరకెళ్ళి–

విసురుగా తిరిగి చూసింది త్రివేణి.

"ఏమిటే బామ్మా... శాపమా... నువ్వు చెప్పినట్టు వినకపోతే శాపం పెట్టేస్తావా? ఇప్పుడు కాదు. సాయంత్రం వచ్చాక చెప్తా నీ పని" అంటూ బయటకొచ్చేసింది.

బ్రీఫ్‌కేస్ కేరియర్‌లో పడేసి–

స్కూటీ స్టార్ట్ చేసింది.

"ఈ ముసలిదాంతో చచ్చిపోతున్నాను. వెధవ చాదస్తమూ ఇదీను" అని విసుక్కొంటూ స్కూటీని వీధిలోకి పోనిచ్చింది.

త్రివేణి లా స్టూడెంట్. సందేహంలేదు. కాని కాలేజి టైంకన్నా రెండు గంటలు ముందుగానే ఇంటినుండి బయలుదేరి ప్రొఫెసర్ ప్రభాకర్ గారి ఇంటికి చేరుకుంటుంది. ఆయన లా కాలేజీలో ప్రొఫెసర్. అంతే కాదు. వరసకు త్రివేణికి మావయ్య అవుతాడు. అందుకే

ఆయన్ని ఆంకుల్ అని పిలుస్తుంది. ఆయనవద్ద సూచనలకి, సలహాలకి చదువుకోడానికి చాలా మంది వస్తుంటారు. అందుకే ఇల్లు, ఆఫీసు కూడా ఒకటే ఆయనకు.

ఆయన వయసు నలభై అయిదు దాటే వుండొచ్చు. ఎందుకోగాని పెళ్ళి చేసుకోలేదు. బ్రహ్మచారిగానే వుండిపోయాడు. లౌఫెయిల్యూర్ అని కొందరు చెవులు కొరుక్కుంటారు. న్యాయశాస్త్రంలో ఆయన మహా పండితుడు. అందుకే తనకు తెలీని విషయాల్ని ఆయన్ని అడిగి తెలుసుకొని చదువుకోడానికి ఆయన ఆఫీసుకు వస్తుంది త్రివేణి. ఆ తర్వాతే కాలేజీకి వెళుతుంది..

దారిలో ఏభై గజాల పొడవున ఇరుకువీధి ఒకటి వుంది. ఆ వీధిలోంచి అవతలి వీధిలోకి పోతే కిలోమీటరు దూరం కలిసొస్తుంది. హైదరాబాద్ ఇరుకు వీధుల గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు గదా.

* * * * * *

ఎప్పటిలాగే స్కూటీని-

రివ్వున ఆ వీధిలోకి పోనిచ్చింది త్రివేణి.

ఎంటరయిన ఏభైగజాల దూరం తర్వాతగాని తను చేసిన పొరబాటు ఏమిటో ఆమెకు అర్థంకాలేదు. అప్ప కే ఆ వీధిలోకి ఎంటరయిన మారుతి జెన్‌కారు ఒకటి ఎదురుగా వచ్చేస్తోంది.

ఆ సన్నటి వీధి వెడల్పు కారుకి సరిపోతుంది.

అటు యిటు రెండడుగుల జాగా కూడా లేదు.

ఎవరో ఒకరు వెనక్కి వెళితేగాని రెండో వాళ్ళు వెళ్ళటం సాధ్యం కాదు. అయినా మొండిగా స్కూటీని ముందుకే పోనిచ్చింది.

"వీడెవడోగాని నాకన్నా ముందుగా ఇటొచ్చి నాకు బుక్కయి పోయాడు. చెప్తా వీడి సంగతి" అనుకుంటూ కారును సమీపించింది.

అటు కారు, యిటు స్కూటీ-

రెండూ ఒకేసారి సడెన్‌బ్రేక్‌తో ఆగాయి.

ఇలాంటి విషయాల్లో-

ఎదుటి వాళ్ళకు ఛాన్స్ వదిలే యువతికాదు త్రివేణి. కారువంక చూసింది. ఫ్రంట్ గ్లాస్ మీద PRESS అని ఇంగ్లీషు లెటర్స్ కన్పించాయి. కారులో ఎవరున్నారో తెలీదు.

స్కూటీ దిగి సైడ్ స్టాండ్ లాగింది.

ఫోర్స్‌గా డ్రయివర్ డోర్‌వైపు వెళ్ళింది.

స్టీరింగ్ వెనక ఒక యువకుడు కూర్చున్నాడు. ఇరవై ఆరు లేదా ఇరవైఏడు సంవత్సరాల వయసులో కుర్రాడు సూపర్‌గా వున్నాడు. ముఖం అమాయకంగా పెట్టి ఏమిటన్నట్టు చూస్తున్నాడు. అతడు తప్ప కారులో ఇంకెవరూ లేరు.

"ఇది కారు వెళ్ళే వీధికాదు. చిన్న సందు, తెలీదా? ప్రెస్ వాళ్ళయితే కొమ్ములొచ్చాయా? డ్రయివింగ్ లైసన్స్ వుందా? తియ్... కారు వెనక్కి పోనీ... హలో మిష్టర్, నేను మాట్లాడుతూనే వున్నాను. గుడ్లగూబలా అలా చూస్తావేమిటి? మర్యాదగా వెనక్కి వెళతావా, పోలీసుల్ని పిలవమంటావా?" అంటూ గఁయ్‌న అరిచింది.

అంత అరిచినా కూడా-

అతడి పెదవులమీద చిరునవ్వు తప్ప-

మరే ఎక్స్‌ప్రెషనూ లేదు.

"హలో... నా మాటలు వినబడటంలేదా... చెవుడా?" దబాయించింది.

"మీ స్కూటీ తీస్తే నేను వెళ్ళిపోతాను" కూల్‌గా చెప్పాడతను.

"నీ కారు వెనక్కి తీస్తావా, పోలీసుల్ని పిలవనా?"

"లిఫ్టు కావాలా.... భలేవారు మేడం. మీ స్కూటీ వుందిగా."

"నీ తలకాయ వుంది... కారు తియ్యి."

"ఈ కారు నాదే మేడం. నేనో పత్రికా విలేకరిని."

తెల్లబోయి చూసింది త్రివేణి.

జుట్టు పీక్కోవాలన్నంత పిచ్చి కోపం.

"ఓరిదేవుడా. మనిషి చూస్తే హీరోలా వున్నాడు. ఎక్కడో చెవిటి మాలోకంలా వున్నాడే. వీడు పత్రికావిలేకరేమిటి?" అతడ్ని చూస్తూ స్వగతంలా పైకే అనుకుంది. ఆ యువకుడు చిరునవ్వు నవ్వాడు. చాలా సమ్మోహనంగా, అందంగా వుంది ఆ నవ్వు.

"నా అడ్రసు అడుగుతున్నారా?" అడిగాడు ఎగాదిగా చూస్తూ.

జీన్స్ పాంటు, టీషర్టు పైన జర్కిన్‌తో అందానికి గీటురాయిలా మెరిసిపోతోంది త్రివేణి. అతడి ప్రశ్న విని నుదురు రుద్దుకుంది.

"పొద్దుటే నువ్వెక్కడ దొరికావురా బాబూ, చెవిటిమేళం.... కారు తియ్యవయ్యా" గట్టిగా అరిచింది.

అతను సిగ్గుపడిపోతూ ఓరగా చూసాడు.

"ఊరుకోండి మేడం! పెళ్ళయింది. నలుగురు పిల్లలు కుడాను... నాకు పెళ్ళిచూపులేమిటి? మీరు మేరేజి బ్యూరోనుంచి వస్తున్నారా?" అనడిగాడు.

డ్రయివరు పెద్ద చెవిటిమేళం అని త్రివేణికి అర్థమైపోయింది. ఒక నమస్కారం పెట్టింది.

"కాస్సేపటికే నాకు పిచ్చెక్కించావ్. నీతో ఎలా వేగుతోందిరా బాబు నీ పెళ్ళాం. నీతో అరిచేకన్నా నేను వెనక్కి పోవడం మంచిది" అంటూ కోపంగా చూసి వెనక్కి వచ్చేసింది.

తన స్కూటీ స్టార్ట్ చేసి వెనక్కి తిప్పి-

వీధి చివరకు వచ్చి కారు వెళ్ళిపోయేవరకూ వెయిట్ చేయసాగింది. ఇంతలో రివ్వున వచ్చి ఆమె పక్కన ఆగింది కారు.

ఏమిటన్నట్టు చూసింది త్రివేణి.

అతను వంకరనవ్వు నవ్వాడు.

"హలో మిస్ ఝాన్సీరాణి...." పిలిచాడు.

"ఏయ్! నా పేరు ఝాన్సీరాణి కాదు. త్రివేణి" అంది రోషంగా.

"నైస్ నేమ్, చూడు త్రివేణి... నువ్వు త్రివేణివో, అలివేణివో నాకెందుగాని నాకు చెవుడు లేదు. ఇది చెప్పటానికే ఆగాను."

"యూ ఛీటర్... లయర్...."

"అరవకు బేబీ. గొంతు నొప్పి పుడుతుంది. నన్ను హీరోలా వున్నానని కాంప్లిమెంట్స్ ఇచ్చినందుకు థాంక్స్. కానీ అదేమిటి? చెవిటి మేళాన్నా!.... పొద్దుటే దొరికానా? ప్రెస్‌వాళ్ళకు కొమ్ములుండవు మేడం, తెలివితేటలుంటాయి, అర్థమైందిగా, ఇక వెళ్ళు" అన్నాడు.

త్రివేణికి నిజంగానే-

పిచ్చిపట్టినంత పనయింది.

"యూ... చెవిటివాడిలా నటించి మోసం చేస్తావా? లాయర్‌నే ఛీట్ చేస్తావా... దొరక్కపోవు. అప్పుడు చెప్తా నీ పని" అనరిచింది.

"పోవే... ప్రెస్ వాళ్ళతో పెట్టుకోకు. మా పెన్నుకు రెండు వైపులా పదునుంటుంది" అంటూ కారును ఒక్క జర్కులో దూకించి ట్రాఫిక్‌లో కలిసిపోయాడతను.

కనీసం అతని పేరు కూడా తెలీదు.

ఇంత సులువుగా తను మోసపోతుందని-

కల్లో కూడా వూహించలేదు త్రివేణి.

"నీలాంటి రణపెంకిని పొగరణచే కుర్రాడు ఎక్కడో పుట్టే వుంటాడు. నీ తిక్క కుదురుస్తాడు" బామ్మ మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి. బుర్ర గిర్రున తిరిగినట్టయింది.

"ఓసి బామ్మా... నీది నోరు కాదే... అన్యాయంగా ఓ అపరిచితుడికి అలుసయిపోయానుగదే... నీ శాపానికి ఇంతటి పవరుంటుందనుకోలేదు. అసలు ఈరోజు లేచిన టైమే బాగున్నట్టు లేదు" అనుకుంటూ స్కూటీని వేగంగా ముందుకు దూకించింది.

* * * * * *

న్యూఢిల్లీ.

ఒబెరాయ్ హోటల్

స్పెషల్ సూట్.

అన్ని వసతులతో కూడిన ఆ ఏ.సి. సూట్‌లో అతి మృదువైన మెత్తని సోఫాలో సుఖాశీనుడై వున్నాడు ఓ వ్యక్తి. అయిదడుగు ఆరంగుళాల ఎత్తు, అంత లావు, సన్నంగాని కండలు తిరిగిన బాడీ, బోడి గుండు, పిల్లి గెడ్డం, చప్పిడి ముక్కు, చికిలి కళ్ళు. అతన్ని చూసిన ఎవరయినా సరే అతన్ని చైనీయుడిగా వెంటనే గుర్తుపట్టేస్తారు. అది నిజం కూడా.

అతను హాంకాంగ్‌కు చెందినవాడు.

అతని పేరు ఖాన్.

అలాగని అతను ఏ వ్యాపారవేత్తో. రాజకీయవేత్తో అనుకుంటే పొరబాటే.

ఖాన్ అంటే కరడుగట్టిన ఓ డబ్బు మనిషి.

డబ్బుకోసం ఏమైనా చేస్తాడు.

ఎవరినయినా చంపుతాడు.

అతను హాంకాంగ్‌కు చెందిన ఓ ప్రొఫెషనల్ కిల్లర్. మంచినీళ్ళ ప్రాయంలా మర్డర్లు చేయటంలో సిద్ధహస్తుడు. ఏదైనా ఒక యూనివర్శిటీలో మర్డర్‌ని ఒక సబ్జెక్ట్‌గా కనుక ఉంచితే అందులో డాక్టరేట్ పొందటానికి అర్హత వున్న తొలి వ్యక్తి ఖాన్ అవుతాడు. గుట్టుచప్పుడు కాకుండా హత్యలు చేయటంలో అంత నేర్పు అతడిది.

ఇంటర్నేషనల్ కిల్లర్ కాబట్టి సహజంగానే ప్రపంచవ్యాప్తంగా పది ప్రముఖ దేశాల్లో అతడిమీద పాతికవరకు కేసులున్నాయి. కేసులయితే వున్నాయిగాని ఆధారాలతో సహా ఖాన్‌ని పట్టుకున్న మగాడు మాత్రం ఇంతవరకూ పుట్టలేదు.

ప్రపంచ వ్యాప్తంగా వున్న భాషల్లో ప్రముఖ భాషలు పదింటిని అనర్గళంగా మాట్లాడగలడు. కన్నుమూసి తెరిచేలోన వేషాలు మార్చగలడు. కనురెప్పపాటులో పోలీసుల్ని తప్పించుకుని పారిపోగలడు.

అటువంటి ప్రమాదకరమైన ఖాన్ ఢిల్లీలో అడుగు పెట్టాడంటే ఏదో ఒక దారుణమైన కుట్రకు అంకురార్పణ జరిగినట్టే. అటువంటి ఖాన్ యిప్పుడు ఒబెరాయ్ హోటల్లో–

తీరిగ్గా సోఫాలో కూర్చుని పెద్ద గ్లాస్ మగ్ నిండుగా వున్న బీర్‌ను కొద్దికొద్దిగా సిప్‌చేస్తూ తన ఎదురుగా కూర్చున్న వ్యక్తిని నిశితంగా చూశాడు.

ఆ వ్యక్తి ఖరీదైన సూట్‌లో–

చాలా హుందాగాను, దర్జాగాను వున్నాడు.

వాళ్ళ సంభాషణ హిందీలో సాగుతోంది.

ఆ వ్యక్తి తన కోటు జేబులోంచి రెండు కలర్ ఫోటోలు తీసి టీపాయ్‌మీద వుంచాడు. వాటిపక్కన ఒక కవరు వుంచాడు.

"నేను చెప్పింది ఏం చేశారు?" అడిగాడు ఖాన్.

"చేసేసాం ఖాన్‌భాయ్! ఆ పని అయిపోయింది. స్విస్‌బ్యాంకు మీ అకౌంట్‌లో పదికోట్ల అమెరికన్ డాలర్స్ జమచేయటం అయిపోయింది" చెప్పాడతను.

"థాంక్యూ! ఇక మీరు వెళ్ళిపోవచ్చు. నా పని నేను చేసుకుపోతాను."

"ఓ.కె. సీయూ! వివరాలు, అడ్రసులు కవర్లో వున్నాయి."

ఆ వ్యక్తి లేచి వెళ్ళిపోయాడు.

బీర్ తాగుతూ తాపీగా, టీపాయ్‌మీది ఫోటోల వంక చూశాడు ఖాన్.

అందులో మొదటి ఫోటో దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ శివశంకర్ గారిది.

రెండో ఫోటో కూడా సుప్రీంకోర్టు మరో జడ్జిగారు శ్రీ యశ్వంత్‌సింగ్ గారిది.

*　*　*　*　*　*

ఎప్పటిలాగే కాలేజీకి రెడీ అయి కిందికి వచ్చిన త్రివేణి టిఫిన్‌కోసం డైనింగ్ టేబిల్ ముందు కూర్చుంది. ఇవాళ చక్కటి డిజైన్‌తో కూడిన చుడీదార్‌లో మరింత అందంగా మెరిసిపోతున్న మనవరాలిని చూసి మురిసిపోయింది బామ్మగారు.

టేబిల్‌మీద ఒక ప్లేటులో వేడి వేడి గారెలు, పక్కన చక్కటి నగిసీ వర్క్‌తో గ్లాస్ డిష్‌లో కోడికూర చూసి త్రివేణి ఆశ్చర్యంతో తలమునకలయింది.

"బామ్మా! ఏమిటే ఇది? ఉన్నట్టుండి ఇంత మంచి ఆలోచన ఎలా వచ్చిందే నీకు?" నమ్మలేనట్టు అడిగింది.

"నీ కోసమే శ్రమపడి వండాను తెలుసా?" అంది ఉత్సాహంగా పక్కన కూర్చుంటూ బామ్మగారు.

"అదేం కాదులే నాకు తెలుసు. రోజూ ఇడ్లీ, దోసె, పెసరట్టు తినీ తినీ నీకు నోరు చప్పబడి వుంటుంది. అందుకే చేసావ్" అంటూ గారెతుంచి కోడికూరతో కలిపి తినటం ఆరంభించింది త్రివేణి. రుచి విషయం చెప్పాలా – అద్భుతం.

"నిజంగా నీ కోసమే చేసాను తల్లీ. కొంచెం ఒళ్ళు చేస్తే ఇంకా అందంగా వుంటావని...'

"ఉన్న అందం చాల్లేగాని... ఏమిటి... చూస్తుంటే నువ్వేదో కాకాపట్టే ఉద్దేశంలో వున్నట్టు కన్పిస్తున్నావే?"

"అదేం కాదులేవే... ఓ మాటడుగుతాను చెప్తావా?"

"నేను తినటం ముగించేలోగా నువ్వు ఏమడిగినా చెప్తాను."

"నువ్వు అరిసెలు తిన్నావ్ గదా?"

"తిన్నాను."

"అరిసెలకు చిల్లు వుండదు... అప్పడాలకు చిల్లు వుండదు. పొంగడాలకు చిల్లుండదు. పూరీకి చిల్లుండదు. ఆఖరికి మషాలా వడకి కూడా చిల్లు పెట్టం. కానీ ఈ గారెలకు మాత్రం చిల్లుపెడతాం. పైగా వేడిగా వున్నప్పుడే తినాలంటాం. ఎందుకని?"

తినటం ఆపి అనుమానంగా బామ్మను చూసింది త్రివేణి.

"బామ్మా! ఇదేదో బూతు ఆలోచనలా వుంది. పొద్దుటే నా మూడ్ ఖరాబుచేస్తే నిన్ను మర్డర్ చేసేస్తాను" అంటూ హెచ్చరించింది.

"ఇందులో బూతు లేదు, భూతం లేదు. దిబ్బరొట్టెలా వుంటే గారి సరిగా వేగదు. చక్కగా అన్నిపక్కలా నూనెలో వేగటం కోసం గారెకు చిల్లు పెడతారు అదన్నమాట. అయితే... ఈ వేడి గారెలకి మన జీవితానికి సంబంధం వుంది. కనీసం అదయినా నీకు తెలుసా?"

"తెలీదులే, అదికూడ నువ్వే చెప్పు."

"పిచ్చిమొద్దూ! వేడిగా వున్నప్పుడే గారెలు తినాలి. వయసు వేడిమీద వున్నప్పుడే సుఖపడాలి."

"ఓహో... నువ్వలాగే సుఖపడ్డావన్నమాట."

"ఇప్పుడు నా వయసు చల్లబడిపోయింది. నా సంగతి ఎందుగ్గాని, నీ సంగతి చెప్పవే... వయసు వేడిమీద వుంది. నువ్వు నీ పెళ్ళి సంగతి ఏం చేసావ్? ఆ ఫారెన్ డాక్టర్‌కు నువ్వు పిచ్చపిచ్చగా నచ్చేసావట. వాళ్ళు నన్ను తొందర చేస్తున్నారు. పెళ్ళి చూపులకు ఎప్పుడురమ్మంటారు బామ్మగారు అని ఫోన్లు మీద ఫోన్లూ..."

అంతే–

తినటం ఆపేసింది త్రివేణి.

"చెప్పాగదా! ఇదేదో కాకాపట్టే ప్రయత్నమని ముందే చెప్పాను. అదే నిజమైంది. ఏమిటి? నా ఫోటో కూడా వాళ్ళకి చూపించేసావా?" అడిగింది.

"నేనేమీ చూపించలేదు. వాళ్ళే మోజుపడి తీసుకున్నారు."

"ఇంకానయం. మీదపడి లాక్కున్నారనలేదు. ఏదో... ఎర్రగా, బుర్రగా, అందంగా వుంటాను గాబట్టి వాళ్ళు మోజుపడొచ్చు. అంత మాత్రాన పెళ్ళికి ఒప్పేసుకుంటానా? నేను పెళ్ళి చేసుకోను అని చెప్పానా లేదా?"

"ఈ మంకుతనమే వద్దు అంటాను. నా మాట వినుతల్లీ. నీ బాధ్యత నామీద పడేసి వాళ్ళిద్దరూ హాయిగా ఫారెన్‌లో కూర్చున్నారు. నీతో వేగలేక ఛస్తున్నాను. నీ మనవరాలు రంభలా వుంది. రతీదేవిలా వుంది. పెళ్ళెప్పుడు చేస్తున్నావంటూ అంతా అడుగుతున్నారు. అమెరికా డాక్టరే. పెళ్ళి చేసుకుంటే అమ్మా నాన్నలకి దగ్గరగా వుండొచ్చు. ఒప్పేసుకోవే" గడ్డం పుచ్చుకుని బ్రతిమాలిందావిడ.

ఆ చేతిని విదిల్చికొట్టి–

చివ్వున లేచింది త్రివేణి.

టేబిల్‌మీద పడున్న పళ్ళు కోసుకునే చాకు అందుకుంది. అది చూసి కెవ్వుమంటూ వెనక్కి దూకింది బామ్మగారు.

"ఓరి దేవుడో... ఏమిటే ఆ కోపం? నన్ను చంపేస్తావా...?" అనరిచింది.

"నిన్ను చంపను" అంది చాకు చూపించి పళ్ళు కొరుకుతూ.

"నువ్వు పొడుచుకు చావాలనా... వద్దే."

"నాకేం ఖర్మ చావటానికి. ఈ చాకుతో వంటిమీద గాయాలు చేసుకుని తిన్నగా పోలీస్‌స్టేషన్‌కి పోతా. నువ్వు నన్ను చంపబోయావని పోలీస్‌కేసు పెడతా. నీకు ఏడేళ్ళు శిక్ష వేయించి జైల్లో తోయిస్తా. అప్పుడుగాని నాకు మనశ్శాంతి వుండదు."

"ఓసినీ అఘాయిత్యం కూల. లక్షణంగా పెళ్ళి చేసుకోమన్నందుకు నన్ను జైల్లో పెట్టిస్తావా. అందుకే... దీన్నిలా చదివించకురా అంటే నా కొడుకు వింటేనా... ఎలాగో అఘోరించు. ఇక పెళ్ళిమాట ఎత్తను" అని ఉడుక్కుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది బామ్మగారు.

"లేకపోతే... నాతో పెట్టుకుంటావా. ముసల్దానా... ఇక పెళ్ళిమాట ఎత్తిచూడు. ఫినిష్" అని నవ్వుకుంటూ బయటకు వచ్చేసి తన స్కూటీ స్టార్ట్ చేసింది త్రివేణి.

ఎప్పటిలాగే–

సరాసరి అంకుల్ ప్రభాకర్ ఇంటికి చేరుకుంది

గేటులోంచి లోనకు పోనిచ్చింది స్కూటీని.

ఎదురుగా వున్న దృశ్యం చూడగానే కీచుమని అరుస్తూ–

సడెన్‌బ్రేక్‌తో స్కూటీని ఆపేసింది.

స్కూటీకి అడుగు దూరంలో సడెన్ బ్రేక్‌తో–

ఆ కారు కూడా ఆగిపోయింది.

ఊహించని సంఘటన యిది.

ప్లేస్ మారిందిగాని సరిగ్గా అదే సంఘటన.

నిన్న వీధిలో - నేడు గేటు లోపల.

అదే కారు - ప్రెస్ కారు.

వళ్ళు మండిపోయింది త్రివేణికి.

"ఏమిటి వీడు మళ్ళీ తగులుకున్నాడు? అదీ అంకుల్ ఇంటి దగ్గర. చెప్తా. ఇవాళ ఏం నాటకమాడతాడో చూస్తా. రేయ్ ప్రెస్సు... అయిపోయావ్‌రా" అనుకుంటూ ఉన్నచోటే స్కూటీని స్టాండ్‌లాగి విసవిసా కారు వద్ద కెళ్ళింది.

అదే యువకుడు.

చక్కటి సూట్‌లో-

ఇవాళ మరింత స్మార్ట్‌గా, క్యూట్‌గా, సూపర్‌గా వున్నాడు. ఆమెను గమనించనట్టే హేండ్‌బుక్‌లో ఏదో నోట్స్ రాసుకుంటూ కన్పించాడు.

"హలో... హలో మిస్టర్" అంటూ పిలిచింది.

"యస్ మిస్... మీ స్కూటీ తీస్తే నేను వెళ్ళిపోతాను" అమాయకంగా ముఖంపెట్టి అడిగాడు.

అతని ముఖంలో ఎక్కడా తనను ఇంతకుముందు చూసిన ఫీలింగ్స్ కనబడకపోవటం చూసి ఆశ్చర్యపోయింది త్రివేణి.

"మీరు నోట్స్ రాసుకుంటూనే కారు నడుపుతారా?" వెటకారంగా అడిగింది.

"లేదు. కారు ఆపినప్పుడు మాత్రమే నోట్సు రాసుకుంటాను. స్కూటీ ప్లీజ్."

"నో... ఒక్క ఇంచుకుడా నా స్కూటీ వెనక్కి వెళ్ళదు. కారు వెనక్కి తియ్యి."

"నో నో... ముందుగా వచ్చింది నేను. మీరే తప్పుకోవాలి."

"నిన్న చెవిటి వాడిలా నటించి మోసం చేసావ్. ఇప్పుడు కుదరదు. వెనక్కి వెళ్ళాల్సిందే."

"ఏయ్ - వాట్ యుమీన్. నిన్నేమిటి, మోసం చేయటం ఏమిటి?"

"మర్చిపోయావా? అప్పుడే మర్చిపోయావా?" నిన్నక్కడ ఇరుకు వీధిలో..."

"ఇకచాలు. అర్థమైపోయింది. అయాం సారీ. వాడు, నేను కాదు."

"వ్వాట్?"

"చూసారా మిస్! మమ్మల్ని చూసినవాళ్ళు మీలాగే... మీలాగే షాకవుతారు. ఇదే కారులో, ఇదే సీట్లో బ్లూషర్టు వేసుకున్నవాడు, అచ్చు గుద్దినట్టు అచ్చంగా నాలాగే వున్నవాడు, వాడ్ని నిన్న మీరు చూసారు. యామైరైట్?"

"షటప్. బుకాయించాలని చూడకు. వాడే నువ్వు. చెవిటి వాడిలా నటించి ఆడపిల్లను మోసం చేయటానికి సిగ్గులేదూ?"

"నాకెందుకు సిగ్గు? వాడు నేను కాదుగదా."

"వాట్ యూ మీన్?"

"మీరలా కోపంగా చూస్తే ఏమీ చెప్పలేను. నా పరువు తీయటానికే పుట్టాడు వెధవ రాస్కెల్, స్టుపిడ్. అసలు విషయం ఏమంటే మేమిద్దరం కవలపిల్లలం. ముందు పుట్టానుగాబట్టి నేను అన్న, నా పేరు శశి. నా తర్వాత పుట్టాడుగాబట్టి వాడు నా తమ్ముడు. వాడి పేరు ప్రీతమ్. వాడు డర్టీ లోఫర్. ఆడపిల్లల్ని అల్లరి చేస్తుంటాడు. ఓసారి వాడనుకుని అమ్మాయిలు నన్ను తన్నబోయారు తెలుసా? ఏమీ అనుకోకండి మేడం. వాడి తరపున నేను సారీ చెప్తున్నాను."

"మీరు నిజమే చెపుతున్నారా?" పజిల్‌గా అడిగింది.

కవలపిల్లలు ఒకేలా వుంటారని విందికాని ఇంతవరకూ యింత ఖచ్చితంగా ఒకేలా వుంటారంటే నమ్మలేకపోతోంది.

అతను హుందాగా నవ్వాడు.

"భలేవారండి. అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకేమిటి? ఇంతకీ మీ పేరేమిటన్నారు?"

"త్రివేణి."

"వేణి అంటే జడ. త్రివేణి అంటే మూడు జడలని అర్థంకదూ. నైస్ నేమ్. కాని మీరు జడ వేసుకున్నట్టు లే...దు... ఒకే ఒకే. అలా కోపంగా చూడకండి. నేను చాలా మంచివాడ్నండి. అమ్మతోడు. ఓకే... ఆ వెధవ మూలంగా నా పరువు కూడా పోతుంది ఏం చేస్తాం. నేనే వెనక్కి పోతాను. జస్ట్ వెయిట్" అంటూ కారును రివర్స్ చేయబోతుంటే వారించింది త్రివేణి.

"ఇట్సాల్‌రైట్. చూస్తే మీరు మంచివారు లాగే వున్నారు. నేనే స్కూటీని తీస్తాను. కాని ఒక్కవిషయం. ఈసారి మీ తమ్ముడు కనబడాలి, ప్రతీకారం తీర్చుకోకుండా వదలదీ త్రివేణి. నా కంటపడవద్దని మీ తమ్ముడ్ని హెచ్చరించండి."

"అబ్బో!... అంత పని చేశాడా?... ఏం చేసాడు మేడం?"

"దట్స్ నన్నాఫ్ యువర్ బిజినెస్."

విసవిసా వెనక్కి వచ్చి స్కూటీ స్టార్ట్ చేసింది. గేటులో నుంచి బయటకొచ్చి పక్కగా ఆపింది. అతని కారు ఒక్క జర్క్‌తో ముందుకు వచ్చి ఆపి, పక్కన ఆగింది. అతని పెదవులమీద చిరునవ్వు చూసి ఉలిక్కిపడింది త్రివేణి.

"హలో మిస్ త్రివేణి. ప్రెస్‌వాళ్ళకు కొమ్ములుండవమ్మా. తెలివితేటలుంటాయి. అర్ధమైందా? నాతో పెట్టుకోకు" అన్నాడు. అంటూనే కారును ముందుకు పోనిచ్చాడు. కన్నుమూసి తెరిచేలోపలే కారు ట్రాఫిక్‌లో కలిసిపోయింది. కాని ఆ షాక్ నుంచి అరనిముషం వరకు కోలుకోలేకపోయింది త్రివేణి.

సేమ్ డైలాగ్.

అంటే... వాడే వాడు... వాడే వీడు.

మరోసారి అతడి చేతిలో మోసపోయింది.

డామిట్.

"ఇంత అమాయకురాలివేమిటి త్రివేణి. వాడు కవలపిల్లల కథ చెపితే నమ్మేయటమేనా?" అంటూ అంతరాత్మ ఫక్కున నవ్వుతుంటే ఆమె ముఖం కోపంతో కుంకుమపువ్వులా ఎర్రబారింది.

"రేయ్ ప్రెస్సూ... నాతోనా నీ ఆటలు. ఈసారి కన్పిస్తావుగా అప్పుడు చెప్తాను" అనుకుంటూ ఆవేశాన్ని అణచుకుని స్కూటీని లోనకు పోనిచ్చింది.

అప్పటికింకా పోర్టికోలోనే నిలబడి వున్నాడు అంకుల్ ప్రభాకర్. ఆమె రాకను గమనించే అతను ఆగినట్టుంది. అది నిజం కూడా.

"ఏమిటమ్మా గొడవ? అక్కడ గేట్లోనే ఆగిపోయావేమిటి?" నవ్వుతూ పలకరించాడు ప్రభాకర్.

"గొడవ కాదు. వాడ్ని చంపేయాలనుంది అంకుల్. వాడికి ఇక్కడ ఏం పని?" ఫోర్స్‌గా అడిగింది.

ఆయన అర్థంకానట్టు చూసాడు.

"నువ్వు ఎవరిని గురించి మాట్లాడుతున్నావు?" అనడిగాడు,

""అదే... కారుకి ప్రెస్ అని అక్షరాలు తగిలించుకున్న పెద్దమనిషి గురించి."

"అరే... అతను నీకు తెలీదా?"

"నాకేం తెలుసు? ఎవరతను?"

"అసలేం జరిగింది? అతని మీద నీకెందుకు ఇంత కోపం?"

"కోపంరాదా? వాడు నన్ను రెండుసార్లు ఫూల్‌ని చేసాడు" అంటూ క్లుప్తంగా జరిగింది చెప్పింది. అంతా విని పెద్దగా నవ్వేసారాయన. ఆయన నవ్వు చూసి మరింతగా రుసరుసలాడింది త్రివేణి.

"ఆ మోసగాడి గురించి చెపుతుంటే నీకు నవ్వుగా వుంది అంకుల్. నాకు నచ్చలేదు" అంది బుంగమూతిపెట్టి.

ఆయన నవ్వాపి ఆమె వంక చూసాడు.

"నీకు నచ్చినా నచ్చకపోయినా అతను మోసగాడు మాత్రం కాదమ్మా. నా ఓల్డ్ స్టూడెంట్‌గా అతను నాకు బాగా తెలుసు. అప్పుడప్పుడూ వచ్చి తన డౌట్స్ ఏమన్నావుంటే అడిగి తెలుసుకుని వెళుతుంటాడు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుత్సాహంగా వుండే ఆ యువకుడు సాధారణ వ్యక్తి కాదు" అన్నాడు.

"ఏమిటంకుల్ మీరు కూడాను. ఆ తుంటరిని మీరెందుకు పొగుడుతున్నారో నాకు అర్థంగావటం లేదు" అంది విసుగ్గా త్రివేణి.

ఆయన పెద్దగా నిట్టూర్చాడు.

"లేదమ్మా. అతను తుంటరి కాదు. సమాజంపట్ల సమకాలీన రాజకీయాలపట్ల ఎంతో అవగాహన వున్న బ్రిలియంట్ యంగ్‌మాన్. నీ అమాయకత్వం చూసి కొంచెం తమాషాగా ఆటపట్టించి వుండొచ్చు. అంతే. నిజానికి అతను ఇండియన్ ఎక్‌ప్రెస్ స్పెషల్ రిపోర్టర్ మిస్టర్ శశిప్రీతమ్" అన్నాడు.

ఆ మాటలకు ఉలిక్కిపడింది త్రివేణి.

నమ్మలేనట్టు చూసింది.

నిజమే... ఆమె అంతగా ఆశ్చర్యపోవడంలో వింతేమీ లేదు.

డేరింగ్ డాషింగ్ డైనమిక్ అండ్ క్రేజీ రిపోర్టర్‌గా శశిప్రీతమ్‌కి ఎంతో పేరుంది. అంతేకాదు. సమకాలీన రాజకీయ పరిస్థితులు, నాయకుల పోకడలను విశ్లేషించి అతను రాసే ఆర్టికల్స్‌కి పత్రికల్లో ప్రత్యేకస్థానం వుంది. అవి చదవటం కోసమే అతడికి ఫాన్స్ వున్నారు.

వాళ్ళలో త్రివేణి కూడా వుంది. ముఖ్యంగా ప్రాణాలకు తెగించి అతడు సేకరించిన ఆధారాలతో ఎన్నో కుంభకోణాలు వెలుగుచూసాయి. అందుకే-

తనతో గొడవ పడింది, అల్లరిచేసింది, తను అభిమానించే పత్రిక విలేకరి అని తెలీగానే ఆమె ఆశ్చర్యపోకుండా వుండలేకపోయింది. ఆమె పెదవులమీద విచిత్రమైన చిరునవ్వు విసిరింది.

"అలాగా అంకుల్" అంది శాంతిస్తూ. మనసులో మాత్రం-

"అంకుల్! నువ్వు చెప్పిందే నిజమైతే ఆ శశిప్రీతమ్ ఏమాత్రం డాషింగ్ హీరోనో తేల్చకుండా విడిచిపెట్టను. వదలనుగాక వదలను అంటూ ఆయనవెంట లోనకు నడిచింది.

ఇది జరిగాక రెండు మూడుసార్లు అనుకుంది శశిప్రీతమ్ మళ్ళీ కనబడితే బాగుండునని. ఆమె కోరిక వారం రోజుల తర్వాత తీరింది. ఆరోజు కాలేజీనుంచి వస్తూ ఏవో కొనటంకోసం ఆమె షాపింగ్ కాంప్లెక్స్‌కి వెళ్ళింది. అక్కడ-

అనుకోని విధంగా ఆమెకు-

శశిప్రీతమ్ కన్పించాడు.

ఇద్దరూ ఎదురుబొదురు అయిపోయారు.

ఆమెను వెంటనే గుర్తించి ముసిముసిగా నవ్వుతూ దగ్గరకొచ్చాడతను. కాని ఆమె మాత్రం అతను ఎవరో తనకు తెలీనట్టు ఫోజుపెడుతూ కనీసం కన్నెత్తి కూడ చూడకుండా స్టయిల్‌గా ముందుకు పోబోయింది. అయితే అతను వదల్లేదు.

"హలో మిస్..." అంటూ దరహాసంతో పలకరించాడు.

"హలో... ఎవరు?" ఎగాదిగా చూస్తూ ప్రశ్నించింది త్రివేణి.

"ఏమిటి? అప్పుడే మర్చిపోయావా... నువ్వు త్రివేణివి కదూ?"

"సారీ... నాపేరు కృష్ణవేణి."

"వ్వాట్?"

"సో వ్వాట్? అయాం... కృష్ణవేణి."

"ఓ షిట్... నువ్వింకా జరిగింది మర్చిపోలేదా...? ఇది ప్రతీకారమా?"

"గొడ్డుకారం ఏమీకాదూ? నువ్వెవరో నాకు తెలీదు. నాపేరు కృష్ణవేణి. అంతే - లీవ్‌మి ప్లీజ్?"

"మరి త్రివేణి ఎవరు?"

"వివరాలు అంత అవసరమా? తెలుసుకోవాలా? ఓకే. అది నా అక్క. యస్... ఇప్పుడర్థమైంది. బహుశ నువ్వు త్రివేణిని చూసి వుంటావ్. పాపం - చాలా అమాయకురాలు. ఉత్తినే మోసపోతుంది. మేమిద్దరం..."

"కవలపిల్లలు... కొంచెం ముందుగా గాబట్టి అది అక్క అయింది. నువ్వు చెల్లి. అచ్చుగుద్దినట్టు మీ యిద్దరూ ఒకేలా వుంటారు. యామైరైట్."

"అరె... ఇంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగావ్? యు ఆర్ రైట్."

"డామిట్!" అంటూ నుదురు రుద్దుకున్నాడు శశిప్రీతమ్.

"నాకెలాగూ బుద్ధిలేదు. ఒక అందమైన అమ్మాయితో ఎలా బిహేవ్ చేయాలో తెలీదు. నీకూ బుద్ధిలేదా? ఒక హేండ్సమ్ కుర్రాడితో ఇలాగేనా బిహేవ్ చేసేది. ప్రతిసారీ యిలా ఒకరికొకరం కహానీలు విన్పించుకోడం బాగాలేదుగాని, మనం రాజీపడిపోదాం. ఏమంటావ్?"

"సో... రాజీకొస్తున్నావ్ గాబట్టి క్షమించేస్తున్నాను. ఓకే."

"మనం ఫ్రెండ్స్ం... ఓకే?"

"డబుల్ ఓకే."

ఇద్దరూ చేతులు కలిపి-

షేక్‌హాండిచ్చుకున్నారు.

"శశిప్రీతమ్... ది గ్రేట్ జర్నలిస్ట్..." ఆమె కామెంట్ చేయబోతుంటే వారించాడు.

"సారీ! గ్రేట్ అనకు... ప్లీజ్. జర్నలిస్ట్ అను చాలు" అంటూ సవరించాడు.

"ఓకే జర్నలిస్ట్... ఫేమస్ జర్నలిస్ట్ శశిప్రీతమ్! నువ్వు నీ అభిమానుల్ని యిలాగే అల్లరి చేస్తుంటావా?" అడిగింది.

"అంటే నువ్వు..."

"యాఁ... నీ ఫాన్‌ని."

"మై గుడ్‌నెస్... నా అభిమానుల్లో ఇంత అందమైన బ్యూటీ వుందని ఇంతవరకు తెలీకపోవటం నా దురదృష్టం. ఈ ఆనందాన్ని తట్టుకోలేకపోతున్నాను. ఈ సంతోషాన్ని అర్జంటుగా నీతో షేర్ చేసుకోవాలి. ఎలా?"

"ఏమిటి? ఇలా ఫ్రెండ్‌షిప్ చేయగానే అలా పార్టీలు, పక్నిక్‌లు అంటూ ఇన్విటేషన్లా. నేను రాను. అర్థమైందా? నేనలాంటి పిల్లను కాదు."

"ఛ ఛ! నేనూ అలాంటివాడ్ని కాదు. నన్ను నువ్వు చాలా తప్పుగా అర్థంచేసుకున్నావ్ త్రివేణి. నేను ఎవరు పిలిచినా పార్టీలకు, పిక్నిక్‌లకు వెళ్ళను. కాని నువ్వు పిలిస్తే వస్తాను. నీ అభిమాన జర్నలిస్ట్‌ని. అభిమానించే వాళ్ళని ఎవరయినా యిలాగే నిలబెట్టి మాట్లాడతారా? కనీసం కూల్‌డ్రింక్... లేదా ఐస్‌క్రీం ఆఫర్ చేయరా? కాస్తమర్యాద చేయాలని కూడా నీకు తెలీదా? జీవితంలో మొదటిసారిగా చూస్తున్నాను నీలాంటి అందమైన పిసినారిని."

ఇక ఆపుకుందామన్నా ఆమెకు నవ్వాగలేదు. మాటలగారడీ అంటే ఏమిటో అతడ్ని చూసి నేర్చుకోవాలి. అటుతిప్పి యిటుతిప్పి చివరకు తనే అతడ్ని ఆహ్వానించేలా చేసాడు.

"ఒకే... చాలు ఇక మాట్లాడకు. కోక్ తీసుకుందాం పద" అంది నవ్వాపుకుంటూ.

ఇద్దరు పక్కపక్కనే నడుస్తూ-

అంత దూరంలోని కూల్‌డ్రింక్స్ స్టాల్‌వైపు కదిలారు.

అలా జంటగా-

అతనితో పక్కపక్కన నడుస్తుంటే-

త్రివేణికి చాలా థ్రిల్లింగ్‌గా వుంది.

చుట్టూ చాలా కళ్ళు తమ జంటనే అసూయగా గమనిస్తున్నాయి. నిజంగానే శశి తన వాడయితే అంతకన్నా తనకి అదృష్టం అక్కర్లేదు.

చాలా లవ్ స్టోరీస్ గొడవలు, పేచీలతోనే మొదలవుతాయంటారు. తన పరిస్థితి చూస్తుంటే అది నిజమేనేమో అన్పిస్తోంది. లేకపోతే అంతగా మండిపడ్డ కుర్రాడితో తను జంటగా నడవటం ఏమిటి?

"నువ్వేం ఆలోచిస్తున్నావో నేను చెప్పనా?" స్టాల్‌ని సమీపిస్తుండగా అడిగాడు శశిప్రీతమ్.

"చెప్పు చూద్దాం" అంది ఉత్సాహంగా.

"బిల్లు నేనే కట్టాలా, తనిస్తాడాని ఆలోచిస్తున్నావ్?"

"నేనాలోచిస్తోంది బిల్లు గురించి కాదు, భవిష్యత్తు గురించి."

"ఆ విషయం నన్నడుగు చెప్తాను."

"ఏమిటి? నువ్వు భవిష్యత్తు చెప్తావా!"

"ఏం చెప్పకూడదా? ఫేస్‌రీడింగ్ మేడం. ముఖం చూడగానే ముందు జీవితం గురించి మూడు ముక్కల్లో చెప్పేయగలను."

"ఆహాఁ! అయితే చెప్పు. నా గురించి చెప్పు చూద్దాం."

"ఒకే... ఒక్కసారి యిలా నా కళ్ళలోకి చూడు."

చూసింది త్రివేణి.

పదిసెకన్ల పాటు-

ఒకరి కళ్ళలోకి ఒకరు చూస్తుండిపోయారు.

అతడి కళ్ళలో ఏదో మేజిక్ వుందనిపించింది.

ఆమెకు ఒళ్ళు పులకరిస్తోంది.

సడెన్‌గా ముఖం తిప్పుకుని-

తల విదిలించాడు శశిప్రీతమ్.

"ఏమైంది? నా భవిష్యత్తు తెలీలేదా?" వెటకారంగా అడిగింది.

"తెలిసింది. నీ భవిష్యత్తు ఉజ్వలంగా దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఖచ్చితంగా నీది లవ్ మేరేజే గాని అరేంజ్‌డ్ మేరేజి కాదు. నువ్వు కోరుకున్న వాడు నీకు నచ్చినవాడే మొగుడవుతాడు. బట్... త్వరలోనే నువ్వు చిక్కుల్లో పడే సూచనలు కన్పిస్తున్నాయి. ప్రమాదాల్ని ఫేస్ చేయాల్సి వస్తుంది. అందుకే అప్‌సెట్ అయ్యాను. బికేర్ ఫుల్. అనవసరమైన విషయాల్లో తల దూర్చకుండా వుంటే మంచిది. నీకు ప్రాబ్లమ్స్ ఎదురయినప్పుడు నీ ఫ్రండ్ ఈ శశి వున్నాడని మాత్రం మర్చిపోకు. నా సెల్‌కి ఫోన్ చెయ్యి" అంటూ తన విజిటింగ్ కార్డ్ ఆమె చేతిలోపెట్టాడు.

"అర్థమైంది. నీ ఫోన్ నంబర్లు యివ్వడానికి ఇంత బిల్డప్ ఇవ్వాలా? అడిగి తీసుకుందామనుకున్నాను. నువ్వే ఇచ్చావు థ్యాంక్స్. ఇది నా సెల్ నంబర్" అంటూ విజిటింగ్‌కార్డు అతనికి ఇచ్చింది త్రివేణి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http:/kinige.com/book/Triveni**

* * *